# అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య

**రాయపోల్, నవంబరు 17, ప్రభాతవార్త :**
అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని వడ్డేపల్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. రాయపోల్ ఎస్ఐ షేక్ మహబూబ్ తెలిపిన వివరాల ప్రకారం రాయపోల్ మండల పరిధిలోని వడ్డేపల్లి గ్రామానికి చెందిన అల్వాల స్వామి (40) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సంవత్సరం క్రితం తన కుమార్తె వివాహం చేసాడు. వివాహానికి అయిన అప్పులు తీర్చలేక అలాగే పంట సరిగ్గ పండకపోవడం తో మనస్థాపం చెంది కుటుంబ సభ్యులకు పొలం దగ్గరికి వెళ్లి వస్తా అని చెప్పి ఇంటి సమీపంలో ఉన్న చెట్టుకు ఉరి వేసుకున్నాడు. స్థానికులు చూసి కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో వారు వెళ్లి చూసే సరికి వేప చెట్టుకు ఉరివేసుకొని చనిపోయి ఉన్నాడు. మృతుని భార్య అల్వాల కవిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షేక్ మహబూబ్ తెలిపారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## వెల్దుర్తిలో పోడు భూములపై గ్రామ సభ


గ్రామసభలో వివరాలు సేకరిస్తున్న రవికుమార్

**వెల్దుర్తి, నవంబర్17 ప్రభాతవార్త:** వెల్దుర్తిలోని గ్రామ పంచాయితీ కార్యాలయంలో గురువారం ఫారెస్ట్ అధికారులు పోడు భూముల వివరాల కోసం గ్రామసభ నిర్వహించారు. సర్పంచి భాగ్యమ్మ ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ అధికారి రవి కుమార్, బీట్ ఆఫీసర్ ప్రియాంక, స్థానిక ఎంపీడీవో జగదీశ్వరచారి, ఈవో బలరాంరెడ్డిలు పాల్గొన్నారు. వెల్దుర్తి, చర్లపల్లి గ్రామాలకు గాను మొత్తం 11 దరఖాస్తులు వచ్చాయని, ఈ దరఖాస్తులను పరిశీలించడం జరుగుతుందని, నివేదికలను పై అధికారులకు సమర్పిస్తామన్నారు. అనంతరం సర్టిఫికె ట్లు ఇవ్వనున్నట్లు తెలిపారు.


బాలల గుండె చికిత్స పరిశోధన కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి హరీష్‌రావు

## ప్రతి వంద మందిలో ఒక చిన్నారి గుండె సంబంధిత వ్యాధితో మృత్యువాత : మంత్రి హరీష్‌రావు

**కొండపాక, నవంబర్ 17, ప్రభాతవార్త:** దక్షిణ భారతదేశ ప్రజలకు ఉచిత గుండె శస్త్ర చికిత్సలు చేయడానికి ఏర్పాటైన వంద పడకల గుండె చికిత్స కేంద్రం ఇక్కడికి రావడం సంతోషంగా ఉందని రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. కొండపాక మండల కేంద్రంలోని శ్రీ సత్యసాయి సంజీవని బాలల గుండె చికిత్స-పరిశోధన కేంద్రాన్ని శ్రీ సద్గురు మధుసూదన్ సత్యసాయితో కలిసి గురువారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో అయన పాల్గొని మాట్లాడారు. కొండపాక ప్రాంత తెలంగాణ రాష్ట్రం ప్రత్యేక సాధించిందని..రూ.50 కోట్లతో ఎందరో దాతల సహకారంతో ఈ ప్రాంతంలో వైద్యాలయం వచ్చేలా సద్గ్గురు మధుసూదన్ అశీస్సులు ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పక్షన తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ప్రతి వంద మందిలో ఒక చిన్నారి గుండె సంబంధిత వ్యాధితో మృత్యువాత పడుతున్నారని..సద్గురు మధుసూదన్‌సాయి గారిని ప్రార్థించగానే ఈ ప్రాంతంలో బాలల గుండె శస్త్ర చికిత్స కేంద్రం అసుపత్రి నెలకొల్పారని తెలిపారు. సద్గురు మధుసూదన్ సత్యసాయి మాట్లాడుతూ రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలకు ఈ వైద్యాలయం ద్వారా కావాల్సిన వైద్య చికిత్సలు అందిస్తామన్నారు. వైద్యాలయం త్వరగా పూర్తయ్యేలా కృషి చేసిన మంత్రి హరీష్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. మనుషుల్లో ఉండే భగవంతుని గుర్తించడమే నిజమైన మాధవ సేవగా సద్గురు మధుసూదన్ వెల్లండించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

**సిద్దిపేట అడిషనల్ డీసీపీ : మహేందర్**


గౌరవ వందనం స్వీకరిస్తున్న డీసీపీ మహేందర్

**చేర్యాల, నవంబర్ 17, ప్రభాతవార్త :** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని..గెలుపు ఓటమిలతో సంబంధం లేకుండా క్రీడల్లో పాల్గొనాలని సిద్దిపేట అడిషనల్ డీసీపీ అడ్మిన్ సందెపొగు మహేందర్ అన్నారు. చేర్యాల పట్టణంలోని ప్రెసెంటేషన్ హై స్కూల్ యాన్యువల్ స్పోర్ట్స్ మీట్‌లో గురువారం అయన పాల్గొని మాట్లాడారు. క్రీడలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయన్నారు. ప్రతి ఒక్కరికి క్రమశిక్షణ, పట్టుదల, సాధించాలనే తపన ఉంటే తప్పకుండా రాణిస్తారని తెలిపారు. ఉన్నత అశయాల కోసం ఇప్పటి నుంచే పాటు పడాలన్నారు. విద్యార్థి దశ చాలా ముఖ్యమైందని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలను చదువుతో పాటు క్రీడల్లో సైతం ప్రోత్సహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి యేటా క్రీడలు నిర్వహిస్తుందన్నారు. సిద్దిపేట తదితర పట్టణాలలో క్రీడల కోసం స్థలాలను కేటాయించి యువతను ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. సిద్దిపేట పట్టణంలో మంత్రి హరీష్‌రావు కృషితో క్రీడలకు పెద్ద పీట వేస్తున్నారని తెలిపారు. క్రీడల్లో ఎంతో మంది రాణించి రాష్ట్ర, దేశ, ప్రపంచ స్థాయిలో చరిత్ర సృష్టించిన వారి జీవిత చరిత్రలు చదివి వారిని అనుసరించాలన్నారు. రాష్ట్ర సర్కారు సైత ం క్రీడలను ఎంతగానో ప్రోత్సహిస్తుందన్నారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ మేరీ లార్ద్, చేర్యాల సీఐ, ఎస్ఐ శ్రీనివాస్, భాస్కర్‌రెడ్డి, స్కూల్ టీచర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు, యోగా టీచర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## దగ్ధమైన బొలోరా వాహనం -తప్పిన పెను ప్రమాదం

**వెల్దుర్తి, నవంబర్17 ప్రభాతవార్త:**
ఓ బొలోరా వాహనానికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు అంటించగా దగ్ధమైంది. త్రుటిలో పెను ప్రమాదం తప్పిన ఈ సంఘటన మండల పరిధిలోని కుకునూర్ గ్రామంలోని పెట్రోల్ పంప్‌లో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. బాధితుడు, పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కుకునూర్ గ్రామానికి చెందిన గ్యారల శ్రీశైలం అనే వ్యక్తి రెండు నెలల క్రితం మహీంద్రా బలోరా వాహనాన్ని కొనుగోలు చేశాడు. ఈ వాహనాన్ని గ్యారల మహేష్‌కు అద్దెకు ఇచ్చి నడుపుతుండటంతో బుధవారం రాత్రి మహేష్ అద్దె ముగించుకొని సుమారు 7.00 గంటలకు బొలోరో వాహనాన్ని శ్రీ వెంకటేశ్వర పెట్రోల్ పంప్‌లో పార్కింగ్ చేశారు. అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు వాహనాని నిప్పు అంటించడంతో పూర్తిగా దగ్ధమైంది. పెట్రోల్ పంపు వద్ద మంటలు చెలరేగుతుండటంతో గ్రామస్థులు చూపి పంపు నిర్వాహకులు రమేష్‌గౌడ్‌కు సమాచారం అందించారు. ఆయన పలువురితో కలిసి సంఘటన స్థలానికి వచ్చి మంటలను ఆర్పారు. లేకుంటే తీవ్ర ప్రమాదం చోటుచేసుకునేదని పలువరు తెలిపారు. గతంలో సైతం ఇంటి వద్ద బొలోరో వాహనాన్ని పెట్టినప్పుడు దగ్ధం చేయడానికి ప్రయత్నించారని బాధితుడు శ్రీశైలం తెలిపారు. నలుగురిపై అనుమానం ఉందని ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. సంఘటన స్థలానికి స్థానిక ఎస్ఐ మధుసూదన్‌గౌడ్ చేరుకుని పరిశీలించారు. బాధ్యులను త్వరలో పట్టుకుంటామన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


దగ్ధమైన బొలోరో వాహనం

# హుస్నాబాద్‌లో ఎర్రజెండా ఎగిరేనా..!?

**- మునుగోడు ఎన్నిక తర్వాత కమ్యూనిస్టుల్లో ఆనందం**

**- పొత్తులో హుస్నాబాద్‌ను సిపిఐకి కేటాయించాలని ఒత్తిడి..!?**

**హుస్నాబాద్, నవంబరు 17, ప్రభాతవార్త :** కాలం కలిసి వచ్చి హుస్నాబాద్ నియోజక వర్గాన్ని ఎర్రజెండా పార్టీకి పొత్తులో టీఆర్ఎస్(బీఆర్ఎస్) కేటాయించిన పక్షంలో ఇక్కడ అసలు ఎర్రజెండా ఎగురుతుందా లేదా అనే అంశంపై సిపిఐ క్యాడర్‌తో సహా పలువురు ఎర్రన్నలు మల్లగుల్లాలు పడుతున్నారు.ఇది కాకండా హుస్నాబాద్‌లో రెండుమార్లు వరుసగా విజయం సాధించిన వొడితెల సతీష్‌కుమార్ అభ్యర్థిత్వాన్ని కాదని టీఆర్ఎస్ ఈ సీటును సిపిఐకి కేటాయిస్తుందా అని తమలో తాము ప్రశ్నించుకుంటున్నారు.ఈ నేపధ్యంలో హుస్నాబాద్ నియోజకవర్గ ముఖచిత్రంపై లోతుగా వెళ్ళి అంతర్గత సమీకరణాలు, లెక్కలను సైతం వేసుకుంటున్నాయి. గతంలో ఉన్న పరిస్థితుల మూలంగా అప్పటి ఎన్‌టీఆర్ ,తెలుగుదేశం పార్టీ హయాంలో హుస్నాబాద్ ప్రాంతంలో అప్పటి కాలంలో బలంగా ఉన్న సిపిఐ పార్టీకి సీటును కేటాయించి నాలుగుమార్లు సిపిఐ పక్షాన దేశిని చిన మల్లయ్య విజయం సాధించగా మరోమారు కాంగ్రెస్ పార్టీ వైఎస్ రాజశేఖరరెడ్డి సైతం హుస్నాబాద్‌ను సిపిఐకి పోటీ చేసిన చాడ వెంకటరెడ్డికి కేటాయించగా విజయం సాధించడం జరిగింది. అనంతరం నియోజకవర్గాల పునర్విభజన నేపధ్యంలో నియోజకవర్గ రూపురేఖలు మారిపోయాయి.గతంలో హుస్నాబాద్ నియోజకవ్గంలో కొనసాగిన బెజ్జంకి మండలం కాస్త ప్రస్తుతం పునర్విభజన ప్రక్రియలో మారి మానకొండూర్‌లో విలీనం కావడం హుస్నాబాద్ నియోజకవర్గంలో భీమదేవరపల్లి, సైదాపూర్, ఎల్కతుర్తి మండలాలను చేర్చి రూపొందించారు. అయితే సిపిఐ కొద్దిగా బలమున్న బెజ్జంకిని కోల్పోయిన సిపిఐ పార్టీకి భీమదేవరపల్లి,సైదాపూర్ మండలాల్లో కొద్దిగా క్యాడర్‌ను ఏర్పాటు చేసుకుని కొద్దిగా ఊరట చెందింది. ఎల్కతుర్తి మండలంలో మాత్రం కొంత సిపిఐ క్యాడర్ ఉంది.ఈ నేపధ్యంలో కొంత సిపిఐ పార్టీకి క్యాడర్ సైతం ఇతర పార్టీలో చేరి సిపిఐకి గుడ్‌బై చెప్పడంతో హుస్నాబాద్‌లో అటు సిపిఐ బలంగా ఉండే సామాజికవర్గం సిపిఐ అగ్రనాయకుడైన దేశిని చినమల్లయ్యను దూరంగా పెట్టడంతో సిపిఐ హుస్నాబాద్ మండలంలో ఓటు బ్యాంకును కోల్పోవాల్సి వచ్చింది. అలాగే అత్యంత బలంగా ఉన్న చాడ వెంకటరెడ్డి స్వంత మండలమైన చిగురుమామిడి మండలంలో సైతం చాడ వెంకటరెడ్డి సిపిఐ రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టి పార్టీ బిజెపి,విపక్షమైన కాంగ్రెస్ పార్టీలు పోరుబాటను పడుతుండుడంతో వారికి ప్రజలు కొంత అనుకూలంగా ప్రజలు అండగా నిలుస్తున్నారు.ఇటీవల మునుగోడు ఎన్నికల అనంతరం పొందిన విజయావకావంతో కమ్యూనిష్టులు తాము కోటగా భావించే హుస్నాబాద్ నియోజకవర్గాన్ని కూడా ఈ సాధారణ అసెంబ్లీ ఎన్నికల్లో


టీఆర్ఎస్,సిపిఐ జెండాల గుర్తులు

ఈ మండలాన్ని అంతగా పట్టించుకోకపోడంతో ఇతర పార్టీలు బలం పుంజున్నాయి.ఈ నియోజకవర్గంలో నెల కొన్న పరిస్థితుల్లో హుస్నాబాద్ నియోజకవర్గాన్ని సిపిఐ కోరుతుండటం పట్ల అటు సిపిఐ పార్టీలో కానీ ఇతర పార్టీల్లోనూ అంతగా స్పందన కనిపించడం లేదు. ముఖ్యంగా ప్రతిసమస్యపై మొదటగా స్పందించే సిపిఐ పోరాటాలు కాస్త వెనక్కి తగ్గి ఇతర పార్టీలు పోరుబాటన నడుస్తుండటంతో ఎర్రజెండా తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.మరీ ప్రధానంగా కేంద్రంలో ఉన్న అధికార కామ్రేడ్లకు సీటును కేటాయించాలని కోరుతున్నారు.ఈ విషయంలో కమ్యూనిష్టుల్లోనూ అంతర్గతంగా ఇక్కడ పోటీ చేయాలనే భావనలో లేరని వినికిడి. కొద్దిమంది అనుచర కామ్రేడ్లు ఒత్తిడి చేస్తుండటం తప్పుడు సమీకరణాలతో పోటీ చేసి పరువును పోగొట్టుకునే పరిస్థితిని తెచ్చుకోవడం ఎందుకని కా మ్రేడ్ ప్రధాన మిలి టెంట్లు కొందరు భావిస్తున్నారు.ఇదే విషయంలో తెలం గాణ రాష్ట్రంలోని తెలంగాణ రాష్ట్ర సమితి గత రెండు రోజుల క్రితం తెలంగాన రాష్ట్ర పార్లమెంటరీ పరిధిలోని శాసనసభ్యలతో సమావేశంలో సిట్టిం గులకే తిరిగి టికెట్లు ఇస్తామని ప్రకటించడం పట్ల కామ్రేడ్ల నోట్లో పచ్చి వెలక్కాయ పడినట్లుగా మారింది. హుస్నాబాద్ నియోజ కవర్గస్థానంలో రెండు పర్యాయాలు వరుసగా వొడితెల సతీష్‌కుమార్ విజయం సాధించడం దీంతో మూడోమారు సైతం అతనికే టికెట్ ఖరారు చేసే అవకాశం ఖచ్చింతగా ఉంటుందని టీఆర్ఎస్ శ్రేణులు ఘంటాపథంగా చెప్పుకుంటున్నాయి.రాబోయే సాధారణ ఎన్నికల ప్రస్థా నంలో అసెంబ్లీ ఎన్నికల సమరం రసవత్తరంగా మారను న్నట్లు పరిశీలకుల అంచనాను బట్టి అవగతమవుతోంది. గతంలో కాంగ్రెస్ హయాంలో శాసనసభ్యునిగా పనిచేసిన అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి సాధారణ ఎన్నికల్లో ఓటమి పాలయ్యాక అతను సైతం టీఆర్ఎస్ గూటికి చేరి ఇటీవల మరలా కాంగ్రెస్ పార్టీలో చేరి రాబోయే శాసనసభ ఎన్నికలలో తానే కాంగ్రెస్ అభ్యర్థిగా చెప్పుకుంటూ ఓదార్పు పర్యటనలు చేస్తుండటం కూడా ఇటీవల నిర్వహిస్తున్నారు, అలాగే బిజెపి పక్షాన అభ్యర్థిత్వం కోసం జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి సైతం ఓదార్పు యాత్రలతో బిజీగా గడు పుతున్నారు.ఈ రసవత్తర పోటీలో అత్యంత సౌమ్యు డిగా పేరొందిన టీఆర్ఎస్ శాసనసభ్యులు వొడితెల సతీష్‌కుమార్‌కు మళ్ళీ పట్టం కడుతారని వస్తున్న ఊహా గానాలను పట్టి తెలుస్తోంది.ఎన్నికల సమయం దరిచేరిన సమయంలో తెలంగాణ రాష్ట్ర సమితి వామపక్ష పార్టీల తో పొత్తును కుదుర్చుకున్న పక్షంలో ఈ సీటును కమ్యూనిష్టులకు కాకుండా ఇతర వేరే ప్రాంతాలైన ఖమ్మం లాంటి బలంగా ఉన్న చోట సిపిఐకి కేటాయిస్తే సబబుగా ఉంటుందని భావిస్తున్నారు.హుస్నాబాద్ లాంటి నియోజకవర్గంలో టీఆర్ఎస్ పార్టీ తెచ్చుకున్న ప్రతిష్టకు భంగం కలగకుండా చూసుకుంటేనే బాగుం టుందని ఆ వర్గాలు భావిస్తున్నాయి. ఈ నేపధ్యంలో రాష్ట్ర టీఆర్ఎస్ ఎన్నికల సమయం నాటికి ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలని వ్యాఖ్యానించుకుంటున్నారు.




పోడుభూముల రైతులతో మాట్లాడుతున్న అటవీ శాఖ అధికారి సయ్యద్ హుస్సెన్ , పట్టా పాస్ పుస్తకాలను చూపెడుతున్న కొండాపూర్ గ్రామ రైతులు

# పోడు భూముల సమస్య పరిష్కారమైయేనా?

**మా భూములను ధరణి పోర్టల్‌లో నమోదు చేయాలి**

**27 మంది రైతుల దరఖాస్తుల తిరస్కరణ**

**మెదక్, నవంబర్ 17, ప్రభాతవార్త:** చిన్నశంకరంపేట మండలం ఎస్. కొండాపూర్ అటవీ శివారు, అటవీ ప్రాంతంలో వివాదంలో ఉన్న 556 ఎకరాల పోడు భూములపై గురువారం అటవీ శాఖ అధికారుల సమక్షంలో గ్రామ సభ నిర్వహించారు. గ్రామ రైతులకు ఎలాంటి సమాచారం లేకుండా పంచాయతీ కార్యలయం వద్ద గ్రామ సభ ఎలా నిర్వహిస్తారని అధికారులను రైతులు నిలదిశారు. పోడు భూముల హక్కుల కోసం గ్రామానికి చెందిన 27 మంది రైతులు దరఖాస్తులు చేసుకున్నారు. అటవీ శాఖ అధికారులు విచారణ జరిపి వారందరు అనర్హులని తెల్చి చెప్పారు. 60 సంవత్సరాలు ఆ భూములను నమ్ముకొని బ్రతుకుతున్నామని, ఇప్పుడు ఆ భూములు మాకు చెందవు అంటే చావే పరిష్కారం అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్వే నంబరు 139,349, 351-356లలో గల తమ భూములకు ధరణి పోర్టల్ రాక ముందు పట్టా పాస్ పుస్తకాలున్నాయని, బ్యాంకు ద్వారా రుణాలను పొందామని, విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ సైతం అమర్చుకొని జివిస్తున్నామని వారు తెలిపారు. దరణి పోర్టల్ వచ్చిన తరువాత ఆ భూములను పార్ట్-బిలో చెరిందని తెలిపారు. కొన్ని సంవత్సరాలుగా జిల్లా పాలనాధికారికి, అటవీ శాఖ అధికారులకు, ఎమ్మెల్యే దృష్టికి తిసుకెళ్లినప్పటికి తమకు న్యాయం జరుగలేదని రైతులు వాపోతున్నారు. పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్దకు తరలిస్తే పట్టా పాస్ పుస్తకాలు ఉంటేనే ధాన్యం సేకరిస్తామని చెప్పడంతో రైతులు తీవ్ర ఆవేదనకు లోనయ్యారు.

**అటవీపై ఆధారపడే వారికే... ఈ భూములు**

**అటవీ శాఖ అధికారి సయ్యద్ ఆజామ్ హుస్సెన్**

2005 డిసెంబర్ 13, అటవి శాఖ చట్టం ప్రకారం ఎస్టీలు ఆ సంవత్సరం కంటే ముందే అటవిలో నివసించిన వారై ఉండాలని, వారికి ఎలాంటి ఆస్తులు ఉండకూడదని, అడవే జీవనాధారంగా ఉన్నవారికి ఈ భూములు దక్కుతాయని అటవీ శాఖ అధికారి సయ్యద్ ఆజామ్ హుస్సెన్ తెలిపారు. అలాగే ఎస్సి ఆర్‌వోఆర్ఎఫ్ఆర్ అటవి చట్టం ప్రకారం 1930 డిసెంబర్ నుండి వారు పోడు భూములు సాగు చేస్తూ ఉండాలని తెలిపారు.

**అధికారులు చొరవ తీసుకోవాలి**

తాత ముత్తాతల నుండి పోడు భూములను నమ్ముకోని జివిస్తున్నామని, ఉన్నతాధికారులు చోరవ తిసుకోని తమకు న్యాయం చేయాలని ఎస్.కోండాపూర్ గ్రామ రైతులు కోరుతున్నారు. రెండు సంవత్సరాల కిందట ఆర్డీవో సాయిరాం సమక్షంలో రెవెన్యూ అధికారులు, అటవీ శాఖ అధికారులు ఉమ్మడి సర్వే నిర్వహించి ఇప్పుడు ఆ భూములు మీవి కావంటే మా పరిస్థితి ఎంటని అధికారులను వారు ప్రశ్నిస్తున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో గణేష్‌రెడ్డి, ఆర్ఐ శ్రీహరి, ఎస్ఐ సుభాష్ గౌడ్, అటవి శాఖ అధికారులు, గ్రామస్తులు పాల్గోన్నారు.


వెయిట్ లిఫ్టింగ్ పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

## క్రీడా హబ్ రాష్ట్ర పోటీలకు వేదిక

**18 నుంచి 21 వరకు రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** రాష్ట్రంలోని సిద్దిపేట జిల్లా కేంద్రం రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు సహకారంతో క్రీడా హబ్‌గా ఏర్పడిందని..ప్రతి యేటా ఎన్నో రాష్ట్ర స్థాయి పోటీలకు వేదికగా నిలుస్తుందని మాజీ మున్సిపల్ చైర్మన్ కడవెర్గు రాజనర్సు అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు, కౌన్సిలర్ ధర్మవరం బ్రహ్మంతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మంత్రి హరీష్‌రావు సహకారం, ప్రోత్సాహంతో క్రీడల్లో జిల్లా ఎంతో చక్కగా రాణిస్తుందన్నారు. క్రీడా హబ్ నూతన క్రీడలకు వేదికగా మారుతుందన్నారు. వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు, కౌన్సిలర్ ధర్మవరం బ్రహ్మం మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 200 మంది క్రీడాకారులు హాజరవుతారని తెలిపారు. 7వ రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు జిల్లా కేంద్రంలోని ముర్షద్ గడ్డ దర్గా సమీపంలో ఈనెల 18 నుంచి 20 వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. 18న మొదటి రోజు క్రీడాకారులకు స్క్రీనింగ్ టెస్ట్, టెక్నికల్ అఫీషియల్స్ సమావేశం ఏర్పాటు చేసి 19న పోటీలు ప్రారంభించడం జరుగుతుందన్నారు. క్రీడ పోటీల నిర్వాహణకు పకడ్బంధీ ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాజ్‌మోహన్‌గౌడ్, జిల్లా యువజన క్రీడా అధికారి నాగేందర్‌గౌడ్, కౌన్సిలర్లు కలకుంట్ల మల్లికార్జున్, నాగరాజురెడ్డి, పిఈటీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి హరికిషన్, స్కేటింగ్ ప్రధాన కార్యదర్శి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యకారులను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యం

**ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి**

**నారాయణఖేడ్, సిర్గాపూర్, నవంబర్ 17 ప్రభాతవార్త :** మత్స్యకారులను ఆదుకోవడమే తెరాస ప్రభుత్వ లక్ష్యమని నారాయణఖేడ్ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం నారాయణ ఖేడ్ నియోజకవర్గ పరిధిలోని ఖాంజీపూర్ చెరువు, సిర్గాపూర్ మండల పరిధిలోని నల్లవాగు మధ్య తరహా ప్రాజెక్టు చెరువులో రెండు లక్షల చేప పిల్లలు, 4.50 లక్షల రొయ్య పిల్లలను ఎమ్మె ల్యే ఎం.భూపాల్‌రెడ్డి చేతుల మీదుగా వదిలారు. ఈ సందర్భంగా గురువారం ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావే శాల్లో మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమానికి తెరాస ప్రభుత్వం లక్ష్య సాధనతో కృషి చేస్తుందన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మత్స్యకారుల సంక్షేమానికి ఏ మాత్రం పట్టించుకోలేదని అన్నారు. తెరాస ప్రభుత్వం ఏర్పాడిన తర్వాత మత్స్య కారుల అభివృద్ధికి మన ముఖ్య మంత్రి కేసీఆర్ అధిక నిధులు కేటాయించి ఆదుకున్న ఘనత తెరాస ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. మత్స్యకారుల పిల్లలు చదువు కునేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించి విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందన్నారు. అనంతరం మత్స్య కారులకు సంబంధించిన అనుమతి పత్రాలను ఆ యా గ్రామాల సంఘా నాయకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిర్గాపూర్ ఎంపీపీ జార మహిపాల్‌రెడ్డి, జడ్పీటీసీ రాఘవరెడ్డి, జిల్లా మత్స్యకార అధికారి శివప్రసాద్, ఫీల్డ్ ఆఫీసర్ శ్రీశైలం, అసిస్టెంట్ రంగనాయక్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తెరాస నాయకులు తదితరులు పాల్గొన్నారు.


చెరువులో చేప పిల్లలను వదులుతున్న ఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

## అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

**సిద్దిపేట రూరల్, నవంబర్ 17, ప్రభాతవార్త :**
సిద్దిపేట త్రీ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని వెల్కటూర్ గ్రామ శివారులో లారీలో, ఆటోలో అక్రమంగా తరలిస్తున్న ప్రభుత్వ రేషన్ బియ్యాన్ని సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. తెల్లవారుజామున వెల్కటూర్ గ్రామ శివారులో మోతె రాజు, జక్కుల అనిల్, ముద్రకోళ్ల శశికుమార్‌లు ఎలాంటి అనుమతి లేకుండా ప్రభుత్వ రేషన్ బియ్యం 30 టన్నులు లారీ, ఆటోలో తరలిస్తుండగా నమ్మదగిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్ హెడ్‌కానిస్టేబుల్, సిబ్బంది కలిసి లారీ, ఆటోను పట్టుకొని తనిఖీ చేయగా రేషన్ బియ్యం లభించినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. బియ్యంతో పాటు లారీ, ఆటోను స్వాధీనం చేసుకొని త్రీ టౌన్ పోలీసులకు అప్పగించినట్లు వివరించారు. మోతె రాజు, జక్కుల అనిల్‌ను అదుపులోకి తీసుకోగా ముద్రకోళ్ల శశికుమార్ పరారీలో ఉన్నారని తెలిపారు. ఈ మేరకు త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు చేస్తున్నారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం



తోటపల్లి గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపిపి లకావత్ మానస

## ఉపాధి హామీ పనులను గుర్తించండి : ఎంపిపి

**హుస్నాబాద్, నవంబరు 17, ప్రభాతవార్త :** 2023-24 సంవత్సరానికిగాను ఉపాధిహామీ పనులను గుర్తించి కూలీలను పురమాయించాలని ఎంపిపి లకావత్‌మానస పిలుపునిచ్చారు. గురువారం హుస్నాబాద్ మండలం తోటపల్లి గ్రామంలో జరిగిన గ్రామసభకు హాజరైన లకావత్ మానస మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ప్రజలు సహకరించేలా చైతన్యం పరచాలన్నారు. అలాగే పారిశుధ్యానికి సంబంధించి తడిపొడి చెత్తను వేరువేరుగా గ్రామ పంచాయతీ సిబ్బందికి అందించేలా చూడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోలవేని లతసంపత్, ఉపసర్పంచ్, వార్డుసభ్యులు ఏపివో, గ్రామ కార్యదర్శి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## తడి చెత్తతో ఎరువులు తయారీపై అవగాహన



చెత్తతో ఎరువులతయారీపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్

**హుస్నాబాద్, నవంబరు 17, ప్రభాతవార్త :** హుస్నాబాద్‌లోని కార్మికులకు మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న గురువారం ఎరువుల తయారీపై అవగాహనను కల్పించారు. పట్టణంలోని వార్డుల పరిధిలో సేకరించిన తడి పొడి చెత్తను కంపోస్టు షెడ్‌కు తరలించడం జరుగుతుందన్నారు. అందులో పొడి చెత్తను డ్రైరీసోర్స్ సెంటర్‌కు, తడి చెత్తను కంపోస్టు సెంటర్‌కు తరలించే కార్మికులు పొడి చెత్తలో నుండి 18 రకాల చెత్తను వేరు చేసి రీసైకిలింగ్‌కు చేర్చడం జరుగుతుందని, తడిచెత్తను ఎరువుగా ఎలా మార్చాలనే అంశంపై కార్మికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ అయిలేని అనితశ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు కొంకటి నళినీదేవి రవి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్, పర్యావరణ ఇంజినీర్ రవికుమార్, డిఆర్‌సిసి ఆపరేటర్ సమత, సవాన్ల సారయ్యప్రభాకర్ పాల్గొన్నారు.

## 72,000 ఉచిత చేపపిల్లల పంపిణీ



చెరువులో చేప పిల్లలను వదులుతున్న దృశ్యం

**కొమురవెల్లి, నవంబర్ 17, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఐనాపూర్‌లో మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా డైరెక్టర్ తేలు ఇస్తారి ఆధ్వర్యంలో మత్స్య సమీకృత అభివృద్ధి పథకంలో భాగంగా గురువారం గ్రామ సహకార సంఘం పరిధిలోగల తాళ్లకుంట, జాంగారి కుంటలో 30 వేల చేప పిల్లలను వదిలారు. అలాగే రసులాబాద్‌లో పరిధిలోని గుగ్గిలకుంట చెరువులో 42 వేల చేప పిల్లలు బంగారు తీగే మూడు రకాల చేపపిల్లలను మొత్తం 72,000 పిల్లలను వదిలారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ అన్నెబోయిన సురేష్, సంఘం నాయకులు పాశం చంద్రయ్య, సున్నపు యాదగిరి, మండల వెంకటి, మెతుకు నరేష్, అన్నబోయిన నర్సింలు, పిట్టల కనకయ్య, మల్లం నరసింహులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే సర్కారు ధ్యేయం : ఎంపిపి



రైతులకు స్ప్రింక్లర్లు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

**చిన్నకోడూరు, నవంబర్ 17, ప్రభాతవార్త :** రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపిపి కూర మాణిక్యరెడ్డి అన్నారు. మండల పరిధిలోని పెద్దకోడూరులో గురువారం 34 మంది రైతులకు స్ప్రింక్లర్లను పంపిణీ చేసి మాట్లాడారు. సిఎం కెసిఆర్ అన్ని వర్గాలవారికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమపథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. తుంపర సేద్యం ద్వారా తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేసుకోవచ్చాన్నారు. ప్రతి రైతు అయిల్ ఫామ్ సాగుపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి భాస్కర్‌రెడ్డి, ఎఎంసి చైర్మన్ కొండం వనితరవీందర్‌రెడ్డి, ఎంపిటిసి సాయన్న, నాయకులు చిట్టి వెంకట్‌రెడ్డి, లచ్చపేట బాల్‌నర్సయ్యగౌడ్, బట్టు తిరుపతి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

## ఫైర్‌స్టేషన్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు

**హుస్నాబాద్, నవంబరు 17, ప్రభాతవార్త :** హుస్నాబాద్ డివిజన్ కేంద్రంలో అగ్నిమాపక కేంద్ర భవనానికి ఒక కోటి 15లక్షలు ప్రభుత్వం మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ వెల్లడించారు. ఈ మేరకు ప్రభుత్వం ప్రిన్సిపల్ సెక్రటరీ రవిగుప్తా జివో విడుదల చేసినట్లు చెప్పారు. హుస్నాబాద్ ప్రాంత అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఇబ్బందులను తొలగించేలా తాత్కాలికంగా ఒక ప్రైవేట్ భవనంలో ఫైర్‌స్టేషన్‌ను నిర్వహిస్తున్న తీరును ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లగా సిఎం కెసిఆర్ స్పందించి నిర్మాణానికి నిధులు కేటాయించారని, ఈ విషయంలో కెసిఆర్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వొడితెల సతీష్‌కుమార్ చెప్పారు.

## తిరిగి సొంత గూటికి చేరుకున్న అరిగె కృష్ణ

**దుబ్బాక, నవంబర్ 17, ప్రభాతవార్త :** బిజెపి మండల అధ్యక్షుడు అరిగె కృష్ణ మూడు రోజుల క్రితం మంత్రి హరీశ్‌రావు, ఎంపి ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో హైదారాబాద్‌లో బిజెపికి రాజీనామ చేసి టిఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. తిరిగి మళ్లి అరిగె కృష్ణ టిఆర్‌ఎస్ కుట్ర రాజకీయాలు నచ్చక అ పార్టీకి రాజీనామా చేసి తిరిగి బిజెపిలో చేరారు. హైదారాబాద్‌లో గురువారం ఎమ్మెల్యే రఘునందన్‌రావు, నిజామాబాద్ ఎంపి ధర్మపురి అరవింద్ సమక్షంలో తిరిగి సొంత గూటికి చేరుకున్నారు.



టిఆర్‌ఎస్ నుంచి సొంత గూడు బిజెపిలో చేరుతున్న కృష్ణ

# పునరావాస కాలనీల్లో వసతుల కల్పనకు కృషి

### ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

**ములుగు, నవంబర్ 17 (ప్రభాతవార్త):**
ప్రభుత్వం నిర్వాసితులకు ఇచ్చిన మాట ప్రకారం పునరావాస కాలనీల్లో అన్ని వసతులు కల్పిస్తామని ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి అన్నారు. మండల పరిధిలోని మామిడ్యాల పునరావాస కాలనీలో గ్రామదేవతల ఆలయాల నూతన నిర్మాణానికి గురువారం వంటిమామిడి మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు కోదూరి భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో డిసిసిబి డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు జహంగీర్, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నర్సింహారెడ్డి, ఎంపిటిసిల ఫోరం మండల అధ్యక్షుడు లింగారెడ్డి, తెరాస సీనియర్ నాయకులు అర్జున్‌గౌడ్, అంజన్‌గౌడ్‌లతో కలిసి ఎమ్మెల్సీ యాదవరెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ యాదవరెడ్డి మాట్లాడుతూ



ఆలయాల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే రోల్‌మోడల్‌గా పునరావాస కాలనీలను నిర్మించిందన్నారు. సర్వం కోల్పోయిన భూ నిర్వాసితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కమ్మరి సత్తయ్యాచారి, నర్సింహారెడ్డి, నరేందర్‌రెడ్డి, వీరేశంగౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అంజిరెడ్డి, హన్మంతరెడ్డి, అనిల్‌చారి, ఆంజనేయులు, సత్తయ్య, యాదగిరి, జగతి, గంట సత్తయ్య పాల్గొన్నారు.



చిన్నారులతో హుస్నాబాద్ ఏసిపి వాసాల సతీష్

## చిన్నారుల చేతుల్లోనే దేశభవిష్యత్తు : ఏసిపి

**హుస్నాబాద్, నవంబరు 17, ప్రభాతవార్త**
దేశ భవిష్యత్తు చిన్నారుల చేతుల్లోనే ఉందని, వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన గురుతర బాధ్యత ఉపాధ్యాయులదేనని ఏసిపి వాసాల సతీష్ అన్నారు. గురువారం పట్టణంలోని శ్రీసిద్ధార్థ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఫస్ట్‌క్లాస్ విద్యార్థులకు కాన్వొకేషన్ ఫెస్టివల్ నిర్వహించగా ఆయన హాజరై చిన్నారులకు వారితో పాటు విద్యను బోధించే ఉపాధ్యాయులకు హితబోధ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ చిన్నారులకు విద్యతో పాటు ప్రదానంగా సంస్కారాన్ని నేర్పించాలని చెప్పారు. చిన్నారులు కష్టంగా కాకుండా ఇష్టంగా పాఠ్యాంశాలను ఔపోసన పడితేనే ఉపయోగకరంగా ఉంటుందని వాసాల సతీష్ ఉద్బోధించారు. ధృవీకరణ పత్రాలు చిన్నారులకు జ్ఞాపికలుగా నిలుస్తాయని అన్నారు. ఈ సందర్భంగా మొదటి తరగతిని పూర్తి చేసుకున్న చిన్నారులకు ధృవీకరణ పత్రాలను పాఠశాల యాజమాన్యం అందచేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఏనుగు రాధాసురేందర్‌రెడ్డి, ప్రదానోపాధ్యాయులు నాగిడి నర్సింహారెడ్డి, పోషకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన...



ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

**నిజాంపేట, నవంబర్ 17, ప్రభాతవార్త:** మండలకేంద్రంలోనూ, కల్వకుంట గ్రామంలోగల ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం వ్యవసాయ సహాయ సంచాలకులు వసంత సుగుణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు నాణ్యత ప్రమాణాలను పాటించి వడ్లను కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని, ఆధార్‌కార్డు, పట్టాపాస్‌బుక్, బ్యాంక్ ఖాతా వివరాలను ట్యాబ్ ఎంట్రీ నిర్వాహకులకు ఇచ్చి ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకొని తగిన మద్దతుధర పొందాలని సూచించారు. ఏరోజు లోడ్ అయిన ధాన్యాన్ని ఆరోజే ఆ రైతుల వివరాలను ట్యాబ్ ఎంట్రీ చేయాలని ట్యాబ్ ఎంట్రీ నిర్వాహకులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సతీష్, ఏఈవో శ్రీలత, కావేరి, సీఈవో శోభారాణి, గోపాల్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కళా ఉత్సవ్-2022లో పాల్గొన్న విద్యార్థులు



నృత్యం చేస్తున్న విద్యార్థిని

**కొల్చారం, నవంబర్17 ప్రభాతవార్త:** కళాఉత్సవ్-2022లో భాగంగా గురువారం కొల్చారంలోని మండల వనరుల కేంద్రంలో నిర్వహించిన వివిధ ప్రదర్శనల్లో ఏడు ఉన్నత పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పది విభాగాలలో విభిన్న రకాల పోటీల ప్రదర్శనలు నిర్వహించారు. ఈ ప్రదర్శనల్లో కొల్చారం, కొంగోడ్, వరిగుంతం, రంగంపేట, చిన్న ఘనపూర్, ఎనగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు కొల్చారం కేజీబీవీ నుండి ప్రదర్శనలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలోని విజేతలు ఈ నెల 22, 23, 24వ తేదీలలో మెదక్‌లో జరగబోయే జిల్లాస్థాయి కళా ఉత్సవ్ కార్యక్రమంలో పాల్గొంటారని మండల విద్యాధికారి నీలకంఠం తెలిపారు. ఈ సందర్భంగా విజేతలకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయ నిర్ణేతలుగా డి.విజయ్‌మోమాన్‌రాజ్, కె.నర్సింలు, ఎం.రమేష్‌లు వ్యవహరించారు. ఎంఆర్‌సీ సిబ్బంది సంపత్‌కుమార్, రాజశేఖర్, వివిధ పాఠశాలల గైడ్ టీచర్లు పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన కాంగ్రెస్ నేతలు

**మెదక్, నవంబర్17 ప్రభాతవార్త:** మెదక్ పట్టణ నూతన మున్సిపల్ కమీషనర్‌గా వచ్చిన జానికరామ్‌ను గురువారం మెదక్ పట్టణ కాంగ్రెస్ నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పీసీసీ నాయకులు మామిళ్ల ఆంజనేయులు మెదక్‌లో పెండింగ్‌లో ఉన్న పనుల గురించి తెలిపారు. అలాగే పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మున్సిపల్ అనుమతితో ఏర్పాటు చేసి ప్లెక్సీలను కావాలని తొలగించడం జరుగుతుందని, అలాగే అధికార టీఆర్‌ఎస్ పార్టీ వారి ప్లెక్సీలను నెలల తరబడి అలాగే ఉంచుతున్నారని, ఈ విషయంపై దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రాజలింగం, గూడూరి ఆంజనేయులుగౌడ్, శ్యాంసుందర్, ఐతారం నర్సింలు, ఇస్మాయిల్, మహేందర్‌రెడ్డి, అహ్మద్, అమీర్‌ఉద్దీన్, ప్రభాకర్, నయీమ్, దాస్ తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్‌కు మొక్కను అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి దేశెట్టి సిద్దరాములు

## కమ్యూనిటీ హాల్‌లు మంజూరు చేయడం పట్ల హర్షం

**నిజాంపేట, నవంబర్ 17, ప్రభాతవార్త:** మండల కేంద్రంతోపాటు నగరం, వెంకటాపూర్, కల్వకుంట, నందిగామ, నందగోకుల్, చల్మెడ గ్రామాలలో రూ. 40 లక్షల వ్యయంతో 8 కమ్యూనిటీ హాల్‌లు మంజూరు చేసినందుకుగాను ఎంపిపి దేశెట్టి సిద్దరాములు, తెరాస నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ నిజాంపేట మండలానికి రూ.40 లక్షల వ్యయంతో కమ్యూనిటీ హాల్‌లు మంజూరు కాగా ఒక్కొక్క కమిటీ హాలుకు రూ.5 లక్షలు మంజూరయ్యాయన్నారు. మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి సహాయ సహకారాలు అందిస్తూ మండల అభివృద్ధికి ఎంతో సహకరిస్తున్నందుకు గాను ఎమ్మెల్యే కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మెన్ బాపురెడ్డి, తెరాస నాయకులు గెరికంటి లక్ష్మినర్సింలు, మాజీ కో ఆప్షన్ సభ్యులు అబ్దుల్ అజీజ్, మాజీ సర్పంచ్ సంగుస్వామి, మైపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఐఎన్‌టియుసి గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా గోవర్ధన్



గోవర్ధన్‌కు నియామకపత్రాన్ని అందజేస్తున్న ఐఎన్‌టీయూసీ రమేష్

**మనోహరాబాద్, నవంబర్ 17 ప్రభాతవార్త:** మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ శ్రేణులు ఇరువురికి గజ్వేల్ నియోజకవర్గ ఐఎన్‌టీయూసీ ఇంచార్జిగా వీరబోయిన గోవర్ధన్ ముదిరాజ్, నియోజకర్గ అధ్యక్షులుగా ఏశం నాగరాజు యాదవ్‌లు ఎన్నికయ్యారు. గురువారం సిద్ధిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు ఎస్. రమేష్ ఇరువురికి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా గజ్వేల్ నియోజకవర్గంలో కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లేష్ యాదవ్, మహేష్, లడ్డూ యాదవ్, రమేష్, అంజి, రాజు తదితరులు పాల్గొన్నారు.

### దళిత రైతుల పొలాలకు వెళ్లకుండా

## గోతులు తీయించిన అగ్రవర్ణ రైతులు



ఎమ్మెల్యే మదన్‌రెడ్డిని కలిసిన దళిత రైతులు

**వెల్దుర్తి, నవంబర్17 ప్రభాతవార్త:** మాసాయిపేట మండలంలోని లింగరెడ్డిపల్లి గ్రామానికి చెందిన 191 సర్వే నెంబర్‌లోగల సబ్ డివిజన్ 1-5 దళితుల భూములు ఉన్నాయని ఎమ్మార్పీఎస్ నాయకులు డప్పు శివరాజ్ తెలిపారు. దళిత రైతులు పొలాలకు పంట నూర్పిడి చేయడానికి వెళ్లకుండా పెద్ద గోతులు తీయించి కోత మిషన్లు వెళ్లకుండా చేశారని, దళితుల భూములకు వెళ్లడానికి పురాతన కాలం నుండి ఉన్న రోడ్డును ముగ్గురు అగ్రవర్ణ రైతులు మూసివేయించారన్నారు. ఈ విషయమై గురువారం నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి వద్దకు రైతులు తరలి వెళ్లి సమస్యను విన్నమించారు. ఎమ్మెల్యే వెంటనే జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూయించారు. తూప్రాన్ ఆర్డీవో, స్థానిక ఎమ్మార్వోలతోనూ మాట్లాడి సమస్యను పరిష్కరించాలన్నారు. సమస్య తీరకుంటే మరోసారి సంప్రదించాలని, రైతులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఎర్ర యాదగిరి, బైండ్ల నందు, సుదర్శన్, రైతులు కృష్ణ, నర్సింగ్‌రావు, సుదర్శన్ తదితరులు ఉన్నారు.

## పొరుగువారికి తోడ్పడడం మన బాధ్యత

### ఎంపిడివో ఉమాదేవి

**రామాయంపేట మున్సిపాలిటీ, నవంబర్ 17, ప్రభాతవార్త:**
మనం సంపాదించిన దాంట్లో కొంత డబ్బు ఇతరులకు దానం చేయడంలో ఎంతో ఆనందం ఉంటుందని ఎంపిడివో ఉమాదేవి అన్నారు. గురువారం నాడు రామాయంపేట మున్సిపాలిటీ ఏడవ వార్డు పరిధిలోని గొలిపర్తి గ్రామంలో ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరియా విద్యాలయం ఓం శాంతి ఆద్వర్యంలో సుమారు 100 మంది నిరుపేద వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. గొలిపర్తి గ్రామానికి చెందిన కోటి సత్యనారాయణరావు ఏర్పాటు చేసిన ఈకార్యక్రమానికి విచ్చేసిన ఎంపిడివో ఆమె చేతుల మీదుగా పలువురికి దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పొరుగువారికి తోడ్పడడం మనందరి బాధ్యత అని అన్నారు. స్థానిక ఎస్ఐ రాజేష్ మాట్లాడుతూ ఈ చలికాలంలో దుప్పట్లు పంచడం వల్ల వృద్ధులకు చాలా ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ఈకార్యక్రమంలో విహెచ్‌పి నేత సంగమేశ్వర్, ఓంతి సంస్థకు చెందిన మాతాజీలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## నోటు పుస్తకాలు, బ్యాగుల పంపిణీ

**మెదక్, నవంబర్ 17, ప్రభాతవార్త:** చిన్నశంకరంపేట మండలం చందంపేటలోని ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం యూత్ ఫర్ సేవా స్వచ్ఛంద సంస్థ సభ్యులు సతీష్, సంజీవ్, సంతోష్‌లు పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులు జామెంట్రీ బాక్స్‌లు, బుక్స్, పెన్నులు అందించారు. విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఎంచుకోని చదవాలని సూచించారు. చదువును ఇష్టపడి చదవి ఉన్నత స్థానాలలో నిలవాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్, సర్పంచి శ్రీలత, ఎంపీటీసీ శివకుమార్, ఎస్ఎంసీ చైర్మన్ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.



జనగామ వేణుగోపాల్‌రావును సన్మానిస్తున్న దృశ్యం

## హుస్నాబాద్‌లో బిజెపి జెండా ఎగరేస్తాం

### నియోజకవర్గ కోకన్వీనర్ వేణుగోపాల్‌రావు

**అక్కన్నపేట, నవంబరు 17, ప్రభాతవార్త :** హుస్నాబాద్ నియోజకవర్గ బరిలో రానున్న సాధారణ అసెంబ్లీ ఎన్నికలలో కమలం జెండాను రెపరెపలాడిస్తామని బిజెపి కోకన్వీనర్ జనగామ వేణుగోపాల్‌రావు అన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గ కోకన్వీనర్‌గా అక్కన్నపేట మండల నాయకులు జనగామ వేణుగోపాల్‌రావు నియామకంపట్ల హర్షం వెలిబుచ్చుతూ శాలువాతో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు నునావత్ మోహన్‌నాయక్, సంతోష్, భూక్య సుదాకర్, దాసరి కృష్ణ, చెరుకు సంపత్, జంగపల్లి యాదగిరి గుగులోతు రాజునాయక్, కర్ణకంటి వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## తిమ్మక్కపల్లిలో సిసి రోడ్డు పనులు ప్రారంభం



తిమ్మక్కపల్లిలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

**రాయపోల్, నవంబరు 17, ప్రభాతవార్త :** గ్రామాల అభివృద్దే టీఆర్‌ఎస్ ప్రభుత్వ లక్ష్యమని జడ్పిటీసీ లింగాయపల్లి యాదగిరి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఇప్ప లక్ష్మి అన్నారు. రాయపోల్ మండల పరిధిలోని తిమ్మక్కపల్లిలో గురువారం ఐదు లక్షల రూపాయలతో నిర్మించనున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను వారు ప్రారంభించారు. అలాగే మండల పరిధిలోని టెంకంపేట గ్రామానికి చెందిన బయ్యారం స్వామిగౌడ్‌కి మంజూరైన 60 వేల సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును సర్పంచ్ అంతన్నగారి సత్తమ్మయాదగిరి, నాయకులతో కలిసి మార్కెట్ కమిటీ చైర్మన్ ఇప్ప లక్ష్మి అందజేసారు. కార్యక్రమాల్లో తిమ్మక్కపల్లి గ్రామ సర్పంచ్ నిర్మలరాజిరెడ్డి, వార్డు మెంబర్ భాస్కర్‌రెడ్డి, నాయకులు ఇప్ప దయాకర్, కిరణ్‌కుమార్‌రెడ్డి, రాజిరెడ్డి, మల్లేశం, నాగరాజు, నర్సింలు, రాములు, ప్రభాకర్, రామచంద్రం, రాజు, బాల్‌రెడ్డి, కాకళ్ల బీరయ్య, విట్టల్, ఆంజనేయులు, కనకయ్య, వెంకటేశం ఉన్నారు.

## సేంద్రియ ఎరువుల వినియోగంపై అవగాహన

**కోహెడ, నవంబర్ 17, ప్రభాతవార్త :** వ్యవసాయంలో రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగం మితిమీరిపోయి.. భూములు గుల్లబారి సాగుకు పనికి రాకుండా పోతున్నాయని సహస్ర క్రాప్ సైన్స్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఏరియా మేనేజర్ మహిపాల్ అవేదన వ్యక్తం చేశారు. మండలపరిధిలోని తీగలకుంటపల్లి గ్రామంలో గురువారం సహస్ర క్రాప్ సైన్స్ ఆధ్వర్యంలో సేంద్రియ ఎరువుల వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యవసాయ భూములను సాగు చేసుకోవలంటే సేంద్రీయ ఎరువులను వినియోగించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సేంద్రియ ఎరువుల వినియోగంవల్ల రైతులకు పెట్టుబడి తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మ్యాకల చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపిపి తడకల రాజిరెడ్డి, ఉప సర్పంచ్ రాగుల రజిత సంపత్, వార్డు సభ్యులు కొమ్మిడి సంజీవరెడ్డి, పెరుగు సురేందర్‌రెడ్డి, రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్ఓ శంకర్, టిఎస్ఓ తలారి సుధాకర్, రైతులు తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు పంటలపై రైతులకు అవగాహన కల్పించారు.

## విద్యార్థులకు చట్టాలపై అవగాహన




చేబర్తిలో చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**మర్కుక్, నవంబర్ 17 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని చేబర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం గజ్వేల్ సబ్ డివిజన్ షీటీమ్ ఇన్‌ఛార్జి ఏఎస్ఐ అమృత్ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా బాలబాలికల రక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. బాలబాలికలను ఎవరైనా వేధిస్తే సమాచారం అందించాలని సూచించారు. విద్యార్థులు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా కొత్త వ్యక్తులు చెప్పే మాయమాటలకు మోసపోవద్దని చెప్పారు. పోక్సో, బాల్య వివాహాల చట్టాలు, సైబర్ క్రైమ్, షీటీమ్స్, ఆన్‌లైన్ మోసాలు, యాంటీ ఉమెన్, ట్రాఫికింగ్ పలు అంశాల పట్ల అవగాహన కల్పించారు. విద్యార్థులకు ఎలాంటి అవసరం ఉన్నా డయల్ 100కు లేదా పోలీస్ కమిషనర్ కంట్రోల్‌రూమ్ నెం.8333998699 లేదా షీటీమ్ వాట్సాప్ నెం.7901640473 నెంబర్లకు సమాచారం అందిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ సంజీవరెడ్డి, మహిళా కానిస్టేబుల్ జ్యోతి, యుగంధర్, అన్వేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజల సంక్షేమమే సిఎం కెసిఆర్ ధ్యేయం

### -ఎంపిపి పాండుగౌడ్

**మర్కుక్, నవంబర్ 17 (ప్రభాతవార్త):** ప్రజల సంక్షేమమే ముఖ్యమంత్రి కెసిఆర్ ధ్యేయమని ఎంపిపి పాండుగౌడ్, జెడ్‌పిటిసి మంగమ్మరాంచంద్రం, వైస్ ఎంపిపి బాల్‌రెడ్డిలు అన్నారు. మండల పరిధిలోని సిఎం దత్తత గ్రామం నర్సన్నపేట గ్రామానికి చెందిన ఎన్.కీర్తన ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు సహాయ సహకారంతో మంజూరైన రూ.45వేల చెక్కును గురువారం స్థానిక సర్పంచ్ మాధవిరాజిరెడ్డితో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు ఎంతో ఉపయోగపడుతుందని, ఇలాంటి అవకాశాన్ని ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు నర్సింలు, మాజీ సర్పంచ్ బాల్‌రెడ్డి, నాయకులు కనకరాజు, మధు, ఆంజనేయులు, నారాయణరెడ్డి, సత్యనారాయణ, పాములపర్తి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## బావిలో పడి మహిళ మృతి

**దుబ్బాక, నవంబర్ 17, ప్రభాతవార్త:** కాలకృత్యాలు తీసుకోవడానికి బయటకు వచ్చిన మహిళ ప్రమాదవశాత్తు కాలుజారి పక్కనే ఉన్న బావిలో పడి మృతి చెందిన సంఘటన మున్సిపల్ పరిధిలోని రేకులకుంటలో బుధవారం రాత్రి జరిగింది. ఎస్ఐ మహేందర్ కథనం ప్రకారం... రేకులకుంట గ్రామానికి చెందిన కోటి యాదయ్య భార్య వెంకటవ్వ(56) కాలకృత్యాలు తీర్చుకోవడానికి ఇంటి బయటకు వెళ్లి అక్కడే ఉన్న పెద్ద బావిలో ప్రమాదవశాత్తు కాలుజారీ పడి మృతి చెందినట్లు తెలిపారు. బయటకు వెళ్లిన భార్య తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల గాలించగా బావి వద్ద వెంకటవ్వ తీసుకెళ్లిన దుప్పటి కనబడంతో బావిలో పడిందని గ్రహించిన కుటుంబ సభ్యులు, గ్రామస్థుల సహాయంతో బావిలో పడి చనిపోయిన వెంకటవ్వ శవాన్ని బయటకు తీసినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

